సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం । 17 । జూన్ । 2023



..చిచ్చర పిడుగులు
బ్యాడ్మింటన్‌లో పాలమూరులోని పలువురు క్రీడాకారులు సత్తా చాటుతున్నారు.
వివరాలు 8లో ▸




పాఠశాలలకు తాళాలు..
ఉమ్మడి జిల్లాలో వివిధ కారణాలతో ప్రభుత్వ పాఠశాలలకు తాళాలు వేశారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.6 /24.5

వాతావరణం
ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

చేయి కలిపేదెవరో..



- సొంతగూటికి మాజీ మంత్రి జూపల్లి
- ఎమ్మెల్సీ కూచుకుళ్ల చేరికపై కొనసాగుతున్న సస్పెన్స్
- వస్తే ఆహ్వానిస్తామంటూనే ఈసారి పోటీ చేసే అవకాశమివ్వాలంటున్న నాగం
- ఇరువురితో సీనియర్ నేతల మంతనాలు
- మారుతున్న పరిణామాలపై పాలమూరు వ్యాప్తంగా ఉత్కంఠ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా పలువురు సీనియర్ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతుండడం ఆసక్తి రేపుతోంది. సీనియర్ నేతలు, మాజీ మంత్రి అయిన కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన జూపల్లి కృష్ణారావు తో పాటు కొడంగల్‌కు చెందిన కురువృద్ధ నేత గురు నాథ్‌రెడ్డి సొంతగూటికి చేరేందుకు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్నారు. వీరితోపాటు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి సైతం హస్తం చెంతకు చేరే అవకాశం ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది. దశాబ్దాల రాజకీయ చరిత్ర ఉన్న సీనియర్ నేతలు.. అది కూడా అధికార బీఆర్‌ఎస్ పార్టీలో అసమ్మతులుగా ముద్రపడిన వారు ఒక్కొక్కరుగా చేయి అందుకుంటుండడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత రాజకీయ పరిణామాల క్రమంలో వారితో ఎవరెవ రు కలిసి వస్తారు.. ప్రభావం ఎంత.. వంటి అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

నేడో, రేపో కాంగ్రెస్‌లోకి జూపల్లి..

మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైనట్లు తెలుస్తోంది. శనివారం ఢిల్లీకి వెళ్లి ముఖ్య నేతల సమక్షంలో పార్టీలో చేరుతారని ఆయన ముఖ్య అనుచరులు కొందరు భావిస్తున్నారు. లేకుంటే భట్టి పాదయాత్రలో భాగంగా నల్లగొండలో గానీ, ఖమ్మంలో గానీ జరిగే బహిరంగసభలో అగ్రనేతల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పలువురు కాంగ్రెస్ నేతలతో ఆయన తరచుగా చర్చలు జరుపుతుండడం ఈ ప్రచారానికి ఊతమిస్తోంది. శుక్రవారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంతోనూ జూపల్లి చర్చలు జరిపారు. గత వారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవితో జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి వేర్వేరుగా భేటీ అయ్యారు. తాను కాంగ్రెస్‌లోకి వస్తే ఎలాంటి పరిస్థితులు ఉంటాయో తెలుసుకునేందుకే మర్యాదపూర్వకంగా కలిసి చర్చించామని నేతలు స్పష్టం చేశారు. అలాగే కొల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నేత జగదీశ్వర్‌రావునూ జూపల్లి కలిశారు. తాను కాంగ్రెస్‌లోకి వస్తే సహకరించాలని ఆయనను జూపల్లి కోరినట్లు తెలిసింది. పార్టీలోకి వస్తే ఆహ్వానిస్తామని, అధిష్టానం టికెట్ ఎవరికి ఇచ్చినా పూర్తి సహకారం అందించాలని జగదీశ్వర్‌రావు చెప్పినట్లు సమాచారం. అనంతరం వచ్చే ఎన్నికల్లో తానే బరిలో ఉంటున్నట్లు జగదీశ్వర్‌రావు ప్రకటించారు.



మారుతున్న సమీకరణాలపై ఉత్కంఠ

అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలలు మాత్రమే ఉన్న నేపథ్యంలో ఏళ్ల పాటు ప్రజాజీవితంలో ఉన్న సీనియర్ నేతలు కాంగ్రెస్‌లో చేరితే మారనున్న రాజకీయ సమీకరణాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వారితో పాటుగా పార్టీలో చేరనున్న ముఖ్య నాయకులు, అనుచరగణం, వారి బలాబలాలపై చర్చ సాగుతోంది. మాజీ మంత్రి జూపల్లి వెంట ఆయన ముఖ్య అనుచరులు పెద్దకొత్తపల్లి ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, కొల్లాపూర్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు హన్మంతనాయక్, కొల్లాపూర్, కోడేరు జెడ్పీటీసీ సభ్యురాలు భాగ్యమ్మ, రమాదేవి, సింగిల్ విండో మాజీ చైర్మన్ రఘుపతిరావు, కోడేరు మాజీ ఎంపీపీ రామ్మోహన్‌రావు, పాన్‌గల్, చిన్నంబావి మాజీ జెడ్పీటీసీ సభ్యులు కేతేపల్లి రవి, కృష్ణప్రసాద్, నియోజకవర్గంలో సీనియర్ నేతలు రామచంద్రారెడ్డి, నిరంజన్‌గౌడ్, గోవింద్‌గౌడ్ తదితర నాయకులు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

కూచుకుళ్ల, నాగంతో కొనసాగుతున్న మంతనాలు



ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నా.. ఎప్పుడు చేరుతారన్న దానిపై సస్పెన్స్ వీడడం లేదు. కాంగ్రెస్‌లో చేరే అంశంపై ఇప్పటికే టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవితో చర్చించిన కూచుకుళ్ల త్వరలో పార్టీ సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డిని సైతం కలుస్తానని చెబుతున్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో తన తనయుడు రాజేశ్‌రెడ్డిని ఈసారి ఎన్నికల్లో బరిలో నిలిపేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నారు. అయితే కాంగ్రెస్‌లోకి వస్తానంటే ఆహ్వానిస్తామని.. ఈ సారి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం తనకే ఇవ్వాలని, తన గెలుపునకు సహకరించాలని నాగం బహిరంగంగానే కూచుకుళ్లకు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య సయోధ్య కుదిర్చేందుకు కాంగ్రెస్ సీనియర్ నేతలు మంతనాలు కొనసాగిస్తున్నారు. మరోవైపు అన్నీ అనుకూలించి పార్టీలో చేరడం ఖాయమైతే, కాంగ్రెస్‌లో చేరే ముందు తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు సైతం దామోదర్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

హస్తం చెంతకు గురునాథ్‌రెడ్డి..

- నేడు లేకుంటే 19న ఠాక్రే సమక్షంలో చేరిక
- కొడంగల్‌లో మారనున్న సమీకరణలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర రాజకీయాలు ఓ ఎత్తు.. కొడంగల్ రాజకీయాలు మరో ఎత్తు అన్నట్లు గతంలో పరిస్థితులు ఉండేవి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కురువృద్ధ నేత, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మళ్లీ సొంత గూడు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించిన క్రమంలో మరో మారు కొడంగల్ రాజకీయం రసవత్తరంగా మారింది. నియోజకవర్గంలో 30ఏళ్లకు పైగా రాజకీయానుభవంతో తిరుగులేని నేతగా ఆయన ఎదిగారు. కొడంగల్ పాలిటిక్స్‌లో ఇద్దరు నేతలు సుదీర్ఘ కాలం పాటు ఎమ్మెల్యేలుగా పని చేశారు. ఇందులో ఒకరు గురునాథ్‌రెడ్డి కాగా, మరొకరు నందారం వెంకటయ్య. వీరి తర్వాత రేవంత్‌రెడ్డి రెండు సార్లు, నరేందర్‌రెడ్డి ఒకసారి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. గురునాథ్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గం నుంచి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రికార్డు సాధించారు. 1978లో స్వతంత్ర, 1983, 1989, 1999, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలిచారు. 2009లో కాంగ్రెస్, 2014లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2018లో టీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసి గెలుపులో కీలకపాత్ర పోషించారు.



నేడు లేకుంటే సోమవారం..

2018 ఎన్నికల ప్రచారంలో భాగంగా కోస్గి బహిరంగసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ పెద్దాయన గురునాథ్‌రెడ్డికి సముచిత స్థానం ఇచ్చి గౌరవించుకుంటామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఉమ్మడి పాలమూరు జిల్లా డీసీసీబీ చైర్మన్ పదవి ఇస్తామని మంత్రి కేటీఆర్ స్వయంగా ప్రకటించారు. ఈ మేరకు తన రాజకీయ చతురతతో గురునాథ్‌రెడ్డి ఎలాంటి ఎన్నికలు లేకుండానే కొడంగల్ పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే ఉమ్మడి జిల్లాలో చోటు చేసుకున్న రాజకీయ ఆధిపత్య పోరులో మరో మారు గురునాథ్‌రెడ్డికి భంగపాటు తప్పలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన పీఏసీఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయనపై బీఆర్‌ఎస్ అసమ్మతి నేతగా ముద్రపడింది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గే బాధ్యతలు చేపట్టగానే.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కొడంగల్‌లోని గురునాథ్‌రెడ్డి ఇంటికి వెళ్లి స్వయంగా కలిశారు. ఖర్గే ఆదేశాల మేరకు కలిసినట్లు రేవంత్ అప్పుడే తెలిపారు. ఆ తర్వాత వారం రోజుల క్రితం మాజీ మంత్రి చిన్నారెడ్డి కొడంగల్‌కు వచ్చి గురునాథ్‌రెడ్డిని కలిశారు. తాజాగా.. శుక్రవారం మరోమారు రేవంత్‌రెడ్డి, చిన్నారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు హైదరాబాద్‌లోని గురునాథ్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. గురునాథ్‌రెడ్డి పెద్ద కుమారుడు జగదీశ్వర్‌రెడ్డి కొడంగల్ మున్సిపల్ చైర్మన్, రెండో కొడుకు రమేష్‌రెడ్డి రావులపల్లి సర్పంచ్‌గా ఉన్నారు. మరో కుటుంబ సభ్యులు కొడంగల్ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఉన్నారు. వీరితో పాటు అనుచరవర్గంతో కలిసి శనివారం లేదా సోమవారం కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. గురునాథ్‌రెడ్డికి సముచిత స్థానం కల్పించడానికి కాంగ్రెస్ భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఆయన రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తారా.. రేవంత్‌కు మద్దతుగా నిలుస్తారా.. అనే అంశంపై నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది. ఈ ప్రభావం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కనిపిస్తుందని భావిస్తున్న ఆయన అభిమానులు, కార్యకర్తలు గురునాథ్‌రెడ్డి తీసుకునే నిర్ణయంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

న్యూస్‌రీల్

వినియోగదారులను మోసం చేస్తే కఠిన చర్యలు



నాగర్‌కర్నూల్ క్రైం: వినియోగదారులకు తక్కువ తూకం ద్వారా వస్తువులను విక్రయించి మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికలు, కొలతల శాఖాధికారి రాజేశ్వర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని చేపల మార్కెట్ వద్ద శుక్రవారం జిల్లా తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు ఏదైనా వస్తువులను కొనుగోలు చేస్తే తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. వస్తువుపై తేదీతోపాటు ధరను చూసుకొని కొనుగోలు చేయాలని, తూకంలో ఏదైనా తేడా ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం హౌజింగ్‌బోర్డు కాలనీలో మటన్ దుకాణాల వద్ద తనిఖీ చేయగా తూకంలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించి ఆనంద్ మటన్ దుకాణంపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషిచేయాలి

బల్మూర్/ అమ్రాబాద్: కుష్టువ్యాధి నివారణపై వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర అధికారి సంతోషిలత అన్నారు. శుక్రవారం స్టేట్ అసెస్‌మెంట్ శ్యాంపిల్ సర్వే బృందం బల్మూరు, మన్ననూర్ పీహెచ్‌సీలను సందర్శించారు. ఈ సందర్భంగా 224 మంది నుంచి నమూనాలు సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుష్టువ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. శరీరంపై మచ్చలు, తిమ్మిర్లు ఉన్నట్లయితే వెంటనే పరీక్షించుకోవాలని, వ్యాధిని సకాలంలో గుర్తిస్తే నిర్మూలన చేయవచ్చన్నారు. కుష్టువ్యాధి సోకిన రోగికి చికిత్స చేసే విధానం, రోగి పట్ల అనుసరించాల్సిన చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీఎం సుకుమార్‌రెడ్డి, వైద్యాధికారి సుధాకర్, లోకేందర్‌రెడ్డి, సిబ్బంది పరశురాం, విజయ్‌కుమార్, శాంతబాయి, అంజిలమ్మ, కుమారచారి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దుచేయాలి

కందనూలు: అక్రమంగా చేసిన డిప్యుటేషన్ల రద్దు చేసి సదరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం జిల్లాకేంద్రంలో డీఈఓ గోవిందరాజులుకు గిరిజన సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ కొల్లాపూర్ మండల విద్యాశాఖలో అంతులేని అవినీతి జరుగుతోందని ఆరోపించారు. గతంలో ఏసీబీకి పట్టుబడిన అధికారుల తీరులో మార్పు రాలేదన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పైరవీలు చేస్తూ తమ వారికి అనుకూలమైన బదిలీలు చేసుకుంటున్నారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో విద్యార్థి సంఘం నాయకులు దశరథం, భరత్ ఉన్నారు.

ఓపెన్ ఇంటర్, టెన్త్ ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఏప్రిల్‌లో నిర్వహించిన ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్సెస్సీలో 600 మంది విద్యార్థులకు 284 మంది విద్యార్థులు పాసై, 47.33 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. కాగా ఇంటర్‌లో 979 మంది విద్యార్థులకు 370 మంది పాసై 37.79 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఓపెన్ టెన్త్‌లో నారాయణపేట జిల్లా 75.77 శాతం, వనపర్తిలో 74.90, గద్వాలలో 70.18, నాగర్‌కర్నూల్‌లో 30.92 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఓపెన్ ఇంటర్‌లో నాగర్‌కర్నూల్ 53.64, గద్వాల 50.13, నారాయణపేటలో 46.21, వనపర్తిలో 40.10 ఉత్తీర్ణత సాధించారు. రీకౌంటింగ్ ఈ నెల 24 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే ప్రక్రియ



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్ తదితరులు

నాగర్‌కర్నూల్: ఇంటింటి సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించి రెండో విడత ఓటరు జాబితా రూపొందించాలని, ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను పునఃపరిశీలించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశ మందిరంలో నియోజకవర్గ ఓటర్ల జాబితా సన్నద్ధతపై బీఎల్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు రెండో విడత ఓటరు నమోదు కార్యక్రమం కోసం బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే 23లోగా పూర్తి చేయాలని, బూత్‌స్థాయి అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించాలని చెప్పారు. సర్వేకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు తప్పనిసరిగా ఈఆర్‌ఓ నెట్ ద్వారా సమర్పించాలన్నారు. జాబితాలో పొరపాట్లు జరగకుండా జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలు, వారికి అందించిన నోటీసులు, తదితర పూర్తి సమాచారం సిద్ధం చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో ఒక ఇంటిలో 6 కంటే అధికంగా ఓట్లు ఉంటే ప్రత్యేకంగా పరిశీలించి ధ్రువీకరించాలని సూచించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్‌లకు ఓటుహక్కు కోసం చేసిన ప్రత్యేక కార్యక్రమాలను వివరించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, వసతుల వివరాలను సమర్పించాలన్నారు. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదని, విధుల్లో పాల్గొన్న సిబ్బందికి రెమ్యునరేషన్ వెంటనే విడుదల చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఈవీఎం గోదాం తనిఖీ

ఈవీఎం గోదాం భద్రతలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అన్నారు. నెలవారి తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి పరిశీలించారు. సీసీ కెమెరా గది, కొత్తగా వచ్చిన వీవీప్యాట్, రికార్డులను తనిఖీ చేసి రిజిష్టర్‌లో సంతకాలు చేశారు. అనంతరం జిల్లా అధికారులకు నూతనంగా నిర్మించే గృహ సముదాయాల భవనాన్ని సందర్శించి.. చివరి దశలో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈవీఎం గోదాం నేషనల్ హైవే రోడ్డులో పోతుండటం వల్ల కొత్తది నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జాకీర్‌అలీ, సిబ్బంది కరుణాకర్, కలెక్టర్ పీఏస్ ఖాజామైనొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

నూతన కలెక్టరేట్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. శానిటేషన్, భద్రత, ఎలక్ట్రిసిటీ తదితర అంశాలపై అదనపు కలెక్టర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ భద్రతకు 70 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కిటికీల నుంచి ఆహార పదార్థాలు పడేయరాదని, పరిసరాల్లో చెత్తాచెదారం వేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా దశాబ్ది ఉత్సవాలు



జిల్లాకేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది, కార్మికులు

కందనూలు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి వేడుకలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలోని పురపాలక శాఖ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో మానవహారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కల్పన జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లాకేంద్రంలోని సాయి గార్డెన్‌లో దశాబ్ది ఉత్సవాల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పురపాలక పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తువులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అంతకుముందు ఆర్డీఓ నాగమణి చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రగతిలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాబురావు, కమిషనర్ జయంత్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ యాదయ్య, ఏఈ ప్రశాంత్, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కొందరికే చేయూత

- కులవృత్తులపై ఆధారపడిన వారికే ఆర్థిక సాయం
- ఇతర వ్యాపారాలు చేసే వారికి వర్తించని పథకం
- సర్వర్ సమస్యతో ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం
- నిలువుదోపిడీకి పాల్పడుతున్న మీసేవ నిర్వాహకులు
- గడువు పెంచాలని వేడుకోలు



అధిక డబ్బుల వసూళ్లపై బల్మూర్‌లోని మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

అచ్చంపేటకు చెందిన మహేష్ తన వ్యాపారాభివృద్ధి కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా తాజాగా ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని భావించారు. అయితే కులవృత్తి కాకుండా మరో వ్యాపారం చేస్తుండటంతో ఆర్థిక సాయం అందే పరిస్థితి కనిపించడం లేదు. ఇది ఒక్క మహేష్‌కు ఎదురవుతున్న సమస్య కాదు. ఎంతో మంది బీసీలకు కులవృత్తి కాకుండా ఇతర వ్యాపారాలు నిర్వహిస్తే వాటి వృద్ధి కోసం ఆర్థిక సాయం అందించే పరిస్థితి లేదు. ఫలితంగా బీసీలలో కొందరికే సాయం అందుతుందనే భావన కలుగుతోంది.

అచ్చంపేట: ప్రభుత్వం ప్రకటించిన బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం పథకం ప్రకారం నాయీ బ్రాహ్మణ, రజకులు, సగర, ఉప్పర, కుమ్మరి, అవుసలి, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్రంగి, కృష్ణ బలిజ పూసల, మేదరి, వడ్డెర, ఆరెకటిక, దర్జీ, అత్యంత వెనకబడిన తరగతుల వారికి మాత్రమే సాయం అందించనున్నారు. వృత్తికి సంబంధించిన పరికరాలు, వృత్తి పనికి అవసరమైన రా మెటీరియల్ కొనుగోలుకు మాత్రమే ఈ సాయాన్ని వినియోగించుకోవాల్సి ఉంది. ఇదిలా ఉండగా బీసీలలో గౌడ, మున్నూరుకాపు, బోయ, గొల్ల, కురుమ, ముదిరాజ్, పద్మశాలి, దూదేకుల, మైనారిటీలు తదితరులు ఉన్నారు. ఇందులో గొల్ల, కురుమలకు రాయితీ గొర్రెల పథకాన్ని వర్తింపజేస్తుండడంతో వీరికి సాయం ప్రకటించకపోయినా ఇబ్బంది లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కులవృత్తి కాకుండా ఇతర వ్యాపారాలు చేసేవారిలో బీసీలే అధికంగా ఉన్నారు. కిరాణ దుకాణాలు, సిమెంట్, హార్డ్‌వేర్, ఫొటో, వీడియోగ్రఫీ, రంగులు, ఎలక్ట్రికల్ దుకాణాలు, లేడిస్ కార్నర్, జనరల్ స్టోర్, పుస్తకాలు దుకాణాలు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఇతరత్ర వ్యాపారాలను అనేక మంది నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన సాయం తమకు కూడా అందిస్తే తమ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటామని పేర్కొంటున్నారు.

మీసేవ కేంద్రాల్లో దోపిడీ..

రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించడంతో వివిధ కులాలకు చెందినవారు మీసేవా కేంద్రాల వద్ద దరఖాస్తు చేసుకునేందుకు బారులుతీరారు. ఇదే అదునుగా మీసేవా కేంద్రాల నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారు. వాస్తవంగా కులం, ఆదాయ సర్టిఫికెట్ల కోసం రూ.45 తీసుకోవాల్సి ఉండగా రూ.75–100 వరకు వసూలు చేస్తున్నారు. వీటిపై రెవెన్యూ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కారణమని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 20 వరకు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో ఇటు తహసీల్దార్ కార్యాలయాలు, అటు మీసేవ కేంద్రాలు ప్రజలతో కిటకిటలాడుతున్నాయి.

సర్వర్ స్లో..

దరఖాస్తులకు ఈ నెల 20 వరకే గడువు ఉండటంతో ఆయా ధ్రువపత్రాల కోసం లబ్ధిదారులంతా ఒకేసారి రావడంతో సర్వర్ సమస్య తలెత్తుతోంది. దీనికి తోడు సిగ్నల్ సమస్య కారణంగా మరింత ఆలస్యమవుతోంది. మీసేవా కేంద్రాల నుంచి ధ్రువపత్రాలు తెచ్చుకున్నా రెవెన్యూ అధికారులు దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఆ దరఖాస్తులు బుట్టదాఖలేనా..?

విశ్వబ్రాహ్మణులు, నాయి బ్రాహ్మణులు అనేక మంది తమ కుల సంఘాల ద్వారా ప్రభుత్వ సాయం కోసం గతంలో దరఖాస్తులు అందించారు. ప్రభుత్వమే పైన పేర్కొన్న రెండు సామాజిక వర్గాల వారికి వృత్తిపరమైన సామగ్రి కొనుగోలు కోసం ప్రకటన చేయగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందలేదు. మళ్లీ ఇప్పుడు దరఖాస్తులను తీసుకుంటుండటంతో పాతవి బుట్టదాఖలేనా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అందరికీ వర్తింపజేయాలి



బీసీల్లో కొన్ని కులాల వారికే ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడం సరైంది కాదు. ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి పొందుతూ జీవిస్తున్న ఎంతో మంది బీసీలకు ఆర్థిక సాయం లేక అప్పుల భారం మోయాల్సి వస్తోంది. అందరికీ సాయం అందిస్తేనే బాగుంటుంది. మత్స్యకారులకు కూడా స్వయం ఉపాధి కల్పించి, ఆర్థిక సాయం చేయాలి.

– బాలస్వామి, మత్స్యకారుడు, గోదల్, బల్మూర్ మండలం

మేం బీసీలం కాదా..



ప్రభుత్వం దృష్టిలో కుల వృత్తి చేసేవారే బీసీలా.. ఎలాంటి కులవృత్తి లేని బోయలు బీసీలు కారా.. కొందరికి సాయం అందించి మిగిలిన వారికి ఎలాంటి సాయం అందించకపోతే వారెలా బతకాలి. ప్రభుత్వం తీరు సరిగ్గా లేదు. బీసీలలో అర్హులైన అందరికీ ఆర్థిక సాయం అందించాలి. ఎలాంటి కులవృత్తి లేని బోయలకు కూడా కార్పొరేషన్ రుణాల్లో ప్రాధాన్యత కల్పించాలి.

– బోయ మల్లేష్, అచ్చంపేట

2,900 దరఖాస్తులు వచ్చాయి..

బీసీలకు ఆర్థిక సాయానికి సంబంధించి ఈ నెల 27 నుంచి జూలై 4 వరకు తుది జాబితా ప్రకటించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన కొత్త మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి రావాలి. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించే అవకాశం కల్పించవచ్చు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 2,900 దరఖాస్తులు వచ్చాయి. మీసేవలో ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నట్లు మా దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, జిల్లా వెనకబడిన తరగతుల శాఖాధికారి

అద్దె వాహనాలకు అవకాశం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిన అద్దె వాహనాలకు అవకాశం కల్పిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీ–హబ్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాస్థాయిలో 7, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాంలో భాగంగా డివిజన్ స్థాయిలో 10 అద్దె వాహనాలు అవసరం ఉందన్నారు. ఆయా వాహనాల యజమానులు శనివారం నుంచి 22 వరకు దరఖాస్తులను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. పూర్తి వివరాలను www. nagarkurnool.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఎంహెచ్‌ఓ వివరించారు.

క్లుప్తంగా

కోయిల్‌సాగర్‌లో హైదరాబాద్ యువతి మృతి

దేవరకద్ర రూరల్: ప్రమాదవశాత్తు కోయిల్‌సాగర్ డ్యాంలో పడి యువతి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన అతియా (25) గురువారం ఉదయం బయటకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి కారులో బయలుదేరింది. రాత్రి తాను కోయిల్‌సాగర్ డ్యామ్ దగ్గర ఉన్నట్లు మహబూబ్‌నగర్‌లో ఉన్న కుటుంబసభ్యులకు సమాచారం అందించింది. వారు అక్కడికి చేరుకునే లోపు డ్యాం మెట్ల దగ్గర నీటిలో చనిపోయి కనిపించింది. ప్రమాదవశాత్తు తన కూతురు మృతి చెందిందని మృతురాలి తల్లి హసీనాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల మండలంలోని కోదండాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటస్వామి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుర్వ చంద్రన్న (63) ఈ నెల 4వ తేదీన ఎద్దు పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో తరలించారు. తిరిగి కర్నూల్ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని కుమారుడు కుర్వ ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

1,500 కిలోల నల్లబెల్లం పట్టివేత



అచ్చంపేట రూరల్: నిషేధిత నల్లబెల్లం సరఫరా చేస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్‌ఐ బాల్‌రాజు హెచ్చరించారు. శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని ఎద్దుమిట్టతండా శివారులో నల్లబెల్లం సరఫరా చేస్తున్న ఓ వాహనాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం రావడంతో తమ సిబ్బందితో ఎక్సైజ్ ఎస్‌ఐలు బాల్‌రాజు, సతీష్ ఎద్దుమిట్టతండా శివారుకు వెళ్లారు. అనుమానంగా వస్తున్న వాహనాన్ని ఆపారు. వాహన డ్రైవర్, ప్రధాన సూత్రధారి నల్లబెల్ల సరఫరా చేస్తున్న లాలు అనే వ్యక్తి తప్పించుకుని పారిపోయాడు. వాహనంలో 1500 కేజీల నల్లబెల్లం, 200 కేజీల పటిక, వాహనాన్ని స్వాధీనం చేసుకుని వాహనంలో ఉన్న మరో వ్యక్తి తులసీరాంను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. వారి వెంట సిబ్బంది ఆంజనేయులు, పరమేష్ పాల్గొన్నారు.

మహిళా న్యాయవాది రెండోరోజు ఆందోళన

జడ్చర్ల: తనపై తప్పుడు కేసు నమోదు చేసి పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ.. జడ్చర్లకు చెందిన ఓ మహిళా న్యాయవాది చేపట్టిన ఆందోళన శుక్రవారం రెండో రోజు కూడా కొనసాగింది. జడ్చర్ల కోర్టు రోడ్డు సమీపంలో 167 నంబర్ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టింది. దీంతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బాధితురాలు అఫీజాబీ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరానగర్‌లో తన ఇంటి పక్కన ఉన్న స్థల వివాదానికి సంబంధించి తాను పోలీసులకు ఫిర్యాదు చేసినా.. తన ఫిర్యాదును ఎంతమాత్రం పట్టించుకోకుండా తనకు వ్యతిరేకంగా ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించి తనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. పోలీసుల చర్యను ఆమె నిరసించింది. సీఐ డౌన్ అనే ప్లకార్డును చేతబట్టి రోడ్డుపై బైఠాయించి న్యాయం చేయాలని కోరింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆమె రోడ్డు పక్కన ఆందోళన చేపట్టగా.. రాత్రి వేళ పోలీసులు ఆమెను జడ్చర్ల ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. వైద్య చికిత్స అనంతరం శుక్రవారం నేరుగా ఆమె మళ్లీ అదే ప్రదేశంలో నిరసన చేపట్టింది. దీంతో జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆమెను ఆటోలో జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. కాగా అఫిజాబీపై కాలనీకి చెందిన వారు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారించి కేసు నమోదు చేశామని సీఐ తెలియజేశారు.



బ్యాడ్మింటన్‌లో.. చిచ్చర పిడుగులు



లోకల్ టాలెంట్

- నిరంతర సాధనతో రాణిస్తున్న జిల్లా క్రీడాకారులు
- కొంతమంది హైదరాబాద్‌లోని పలు అకాడమీల్లో ప్రత్యేక శిక్షణ
- రాష్ట్రస్థాయి టోర్నీలకు ఎంపికవుతున్న జిల్లావాసులు

మహబూబ్‌నగర్ క్రీడలు:

వ్యక్తిగత క్రీడాంశాల్లో షటిల్ బ్యాడ్మింటన్‌కు ఎంతో గుర్తింపు ఉంది. ఎంతో క్రేజ్ ఉన్న క్రీడగా షటిల్ బ్యాడ్మింటన్ పేరొందింది. అలాంటి షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలో ఇప్పుడిప్పుడే జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటుతున్నారు. ఉమ్మడి జిల్లాలో షటిల్ బ్యాడ్మింటన్ ప్రాక్టీస్ చేయడానికి అరకొరగా ఇండోర్ స్టేడియంలు ఉన్నా చాలామంది క్రీడాకారులు మైదానాల్లో నిరంతరం ప్రాక్టిస్ చేస్తున్నారు. కొంతమంది జిల్లా క్రీడాకారులు హైదరాబాద్‌లోని పలు షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీల్లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటూ రాష్ట్ర, ర్యాంకింగ్స్ టోర్నమెంట్‌లో పాల్గొంటూ రాణిస్తున్నారు.

సత్తాచాటుతున్న అక్కాచెల్లెళ్లు



జిల్లాస్థాయి టోర్నీలో విన్నర్‌గా నిలిచి ట్రోఫీ అందుకుంటున్న ద్రితి సహస్ర

జిల్లాకేంద్రానికి ద్రితి సహస్ర, దీక్ష సహస్ర షటిల్ బ్యాడ్మింటన్‌లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. వీరు హైదరాబాద్‌లోని చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటూ పలు రాష్ట్రస్థాయి టోర్నీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 13 ఏళ్ల ద్రితి సహస్ర షటిల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తుంది. రెండున్నరేళ్ల నుంచి చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటుంది. మొహాలి, ముంబాయి (2022), హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ర్యాంకింగ్స్ టోర్నీల్లో పాల్గొంది. ఈ ఏడాది రాజస్తాన్ రాష్ట్రం జైపూర్‌తోపాటు గత రెండు రోజులుగా హర్యానా రాష్ట్రం పంచకుల్లలో జరుగుతున్న నేషనల్ ర్యాంకింగ్స్ టోర్నీల్లో ఆడుతుంది. మిర్యాలగూడ, వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి టోర్నీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించింది. ఇటీవలే మహబూబ్‌నగర్‌లో జరిగిన జిల్లాస్థాయి టోర్నీ కం సెలక్షన్స్‌లో అండర్-15, 17, 19 విభాగాల్లో విన్నర్‌గా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఒలింపిక్స్‌లో దేశానికి గోల్‌మెడల్ తీసుకురావడమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తానంటోంది ద్రితి సహస్ర.

రాష్ట్రస్థాయికి దీక్ష సహస్ర..



దీక్ష సహస్ర

పదేళ్ల దీక్ష సహస్ర అక్క బాటలోనే షటిల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తుంది. ఏడాదిన్నర నుంచి చేతన్ ఆనంద్ అకాడమీలో బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకుంటుంది. ఇప్పుడిప్పుడే తన ఆట నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంది. ఇటీవలే జిల్లాకేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి షటిల్ టోర్నీ కం సెలక్షన్స్‌లో అండర్-13 విభాగంలో విన్నర్‌గా నిలిచి త్వరలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు ఎంపికైంది.

పాలిటెక్నిక్ టోర్నీల్లో అబ్దుల్ రహెమాన్



అబ్దుల్ రహెమాన్

జిల్లాకేంద్రానికి చెందిన అబ్దుల్ రహెమాన్ మూడేళ్ల నుంచి సీనియర్ క్రీడాకారుడు సయ్యద్ ఎజాజ్‌అలీ వద్ద షటిల్ బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకుంటున్నాడు. పాలిటెక్నిక్ ఉమ్మడి జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో డబుల్స్ విభాగంలో విన్నర్‌గా నిలిచాడు. రాష్ట్రస్థాయి, సౌత్‌జోన్ పాలిటెక్నిక్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మరో క్రీడాకారుడు ఎండీ అమాన్‌తో కలిసి డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. జిల్లాస్థాయి సీఎం కప్ టోర్నీలో సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో డబుల్స్ విభాగంలో అమాన్‌తో కలిసి రహెమాన్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జీషాన్..

జిల్లాకేంద్రానికి చెందిన ఎండీ జీషాన్ షటిల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నాడు. సీనియర్ క్రీడాకారుడైన మేనమామ సయ్యద్ ఎజాజ్‌అలీ వద్ద ఐదేళ్ల నుంచి శిక్షణ తీసుకుంటూ ప్రతిభచాటుతున్నాడు. పలుమార్లు జిల్లాస్థాయి టోర్నీల్లో రాణించాడు. గతేడాది హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో జిల్లా నుంచి ఆడాడు. ఇటీవలే జరిగిన సీఎం కప్ జిల్లాస్థాయి టోర్నీలో సయ్యద్ ఎజాజ్‌అలీతో కలిసి జీషాన్ డబుల్స్‌లో విన్నర్‌గా నిలిచి హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. జిల్లాకేంద్రంలో జిల్లాస్థాయి టోర్నీ కం సెలక్షన్స్‌లో డబుల్స్‌లో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నాడు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో షటిల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నట్లు, అంతర్జాతీయ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమంటున్నాడు జీషాన్.



షటిల్ ప్రాక్టీస్ చేస్తున్న ఎండీ జీషాన్

రాయిచేడ్‌లో కారు బీభత్సం

- రోడ్డు పక్కన కూర్చున్న మహిళలను ఢీకొట్టిన వైనం
- అక్కడికక్కడే ఇద్దరు మృతి, ఒకరి పరిస్థితి విషమం
- డ్రైవర్‌ను చితకబాది పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు



అమృత (ఫైల్)



అనిత (ఫైల్)

ఉప్పునుంతల: మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ కారును వేగంగా నడపడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన కూర్చున్న మహిళలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలవగా.. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. మండలంలోని రాయిచేడ్‌లో శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో గ్రామానికి చెందిన ఆశా వర్కర్ నకిరెకంటి అమృత(37), పంచాయతీ వర్కర్ ఎత్తేపు ఉస్సేనమ్మ, చింత కుంట్ల అనిత(24) రోడ్డు పక్కన కూర్చొని మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో అచ్చంపేట మండలం వర్త్య మంగ్యానాయక్ మద్యం మత్తులో కారును వేగంగా నడుపుతూ వచ్చి రోడ్డుపక్కన కూర్చున్న వారిని ఢీకొట్టడంతో అమృత అక్కడికక్కడే మృతిచెందగా.. అనిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఉస్సేనమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మహిళలను ఢీకొట్టి కారుతో పారిపోతున్న మంగ్యానాయక్‌ను గ్రామస్తులు వెంబడించి సింగారం సమీపంలో పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. అమృత తల్లిగారి ఊరైన రాయిచెడ్‌లోనే ఉంటూ ఆశావర్కర్‌గా పనిచేస్తుంది. ఆమెకు భర్త నిరంజన్, ఒక కూతురు, కుమారుడు ఉండగా.. అనితకు భర్త చెన్నయ్యతోపాటు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ ప్రమాదంపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

టిప్పర్ ఢీకొని బాలిక..

అచ్చంపేట రూరల్: ప్రమాదవశాత్తు టిప్పర్ ఢీకొనడంతో ఓ బాలిక దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని నడింపల్లి స్టేజీ వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా.. నడింపల్లి గ్రామానికి చెందిన పానుగంటి బాలరాజు కూతురు బిందు(11) తల్లితో కలిసి అచ్చంపేటకు వెళ్లడానికి స్టేజీ వద్దకు వచ్చింది. అచ్చంపేట నుంచి హాజీపూర్ వైపు వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్తతో బాలికను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై బాలిక తండ్రి బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

వంతెన నిర్మాణంలో నాణ్యత పాటించాలి

మదనాపురం: మండల కేంద్రంలోని ఊకచెట్టు వాగుపై నిర్మిస్తున్న వంతెన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. శుక్రవారం వంతెన పనులను వారు పరిశీలించి మాట్లాడారు. పోరాటాల ఫలితంగానే ఊకచెట్టు వాగుపై వంతెన పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. క్యూరింగ్ సరిగా చేయడం లేదని.. సరైన పద్ధతిలో నిర్మాణం జరగాలని కోరారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తి చేయాలన్నారు. వారి వెంట పార్టీ మండల కార్యదర్శి ఎస్.రాజు, మండల నాయకులు వెంకట్రాములు, విష్ణు, చెన్నయ్య, వెంకటేష్, చిరంజీవి, మణివర్ధన్, మాసన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించలేదని.. బడికి తాళం

దేవరకద్ర రూరల్: పాఠశాల తరగతి గదులు నిర్మించి ఆరునెలలు అవుతున్నా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ తాళం వేసిన సంఘటన శుక్రవారం బొల్లారం (కోయిల్‌సాగర్)లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మన ఊరు- మనబడి పథకంలో భాగంగా బొల్లారంలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రూ.30 లక్షల పనులను కేటాయించింది. ఈ పనులను స్కూల్ కమిటీ తీర్మానం మేరకు గ్రామానికి చెందిన సుధాకర్ దక్కించుకొని ఆరు నెలల్లో పూర్తి చేశారు. ఇందుకు గాను రూ.19 లక్షలు చెల్లించగా.. మిగతా బిల్లులు రావాలని సంబంధిత అధికారులను కోరినా నిర్లక్ష్యం చేశారు. అయితే అప్పు చేసి పనులు చేశానని, ఇప్పుడు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నానని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సదరు గదులకు తాళం వేశారు. దీంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులను వరండాలోనే కూర్చోబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధించారు. సమాచారం తెలుసుకున్న అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి రావాల్సిన బిల్లులో రూ.2 లక్షలకు చెక్కులను అందించి మిగతావి త్వరలోనే చెల్లిస్తామని చెప్పడంతో తాళం తీసి సిబ్బంది, విద్యార్థులను లోపలికి అనుమతించారు.



పాఠశాల గదులకు తాళం వేస్తున్న కాంట్రాక్టర్

టీచర్ సక్రమంగా రావడం లేదని..

మల్దకల్: ఉపాధ్యాయురాలు పాఠశాలకు సక్రమంగా రావడం లేదని సర్పంచ్ పాఠశాలకు తాళం వేసిన సంఘటన మండలంలోని శేషంపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా.. స్థానిక ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు చదువుకుంటుండగా ఒకే ఉపాధ్యాయురాలు విజిత పనిచేస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభించగా.. ఉపాధ్యాయురాలు సక్రమంగా రావడం లేదని, దీంతో విద్యార్థులు నష్టపోతున్నారని సర్పంచు ప్రతాప్ ఆరోపించారు. ఈ విషయమై పద్ధతి మార్చుకోవాలని ఉపాధ్యాయురాలికి సూచించినా పట్టించుకోవడం లేదని బడికి తాళం వేశారు. పాఠశాలకు తాళం వేసిన విషయం తెలుసుకున్న విద్యార్థులు చాలామంది హాజరుకాలేదు. ఉపాధ్యాయురాలు మాత్రం పాఠశాల ఆవరణలోనే వచ్చిన కొద్దిమంది పిల్లలకు పాఠశాలు చెప్పి, సమయం ముగిసిన తర్వాత వెళ్లిపోయారు. ఈ విషయమై ఉపాధ్యాయురాలు విజిత స్పందిస్తూ తనను సర్పంచ్ ప్రతాప్ ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. ఇన్‌చార్జ్ ఎంఈఓ కొండారెడ్డిని వివరణ కోరగా దీనిపై విచారణ చేసి, వాస్తవాలను తెలుసుకుంటామని చెప్పారు.



తాళం వేసిన శేషంపల్లి ప్రాథమిక పాఠశాల

వరకట్న వేధింపులకు గర్భిణి బలి

చర్యలు తీసుకోవాలని బంధువుల ఆందోళన



బాలమణి (ఫైల్)

కోడేరు: వరకట్న వేధింపులకు ఓ గర్భిణి బలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం పస్పులలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. కోడేరుకు చెందిన ఓర్సు బాలమణి(19), పస్పులకు చెందిన మానపాడు తరుణ్ పది నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం బాలమణి మూడు నెలల గర్భిణి. అయితే కొన్నిరోజులుగా భర్త తరుణ్, అత్త జ్యోతి, మామ పెద్ద పోషయ్య ప్రతిరోజు కట్నం తీసుకురాలేదని మానసికంగా, శారీరకంగా వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో ఈ నెల 8న ఇంట్లో ఉన్న పురుగు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబీకులు నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందడంతో మృతదేహాన్ని పస్పులకు తీసుకువచ్చారు. బంధువులు, తల్లిదండ్రులు విషయం తెలుసుకొని అక్కడికి చేరుకొని భర్త, అత్తామామల వేధింపుల వల్లే తమ కూతురు చనిపోయిందని ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, సీఐ యాలాద్రి, కొల్లాపూర్ ఎస్‌ఐ రాజు గ్రామానికి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై బాలమణి తండ్రి మశయ్య ఫిర్యాదు మేరకు భర్త, అత్తామామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పులిజాడ కోసం ముమ్మర గాలింపు



ఇంజమ్మ గుట్టలో తిరుగుతున్న ఫారెస్టు అధికారులు, గ్రామస్తులు

గట్టు: మండలంలోని ఇందువాసి ఇంజమ్మ గుట్టల పరిసరాల్లో పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేసిన నేపథ్యంలో శుక్రవారం రెండోరోజు అటవీశాఖ అధికారులు ముమ్మర గాలింపు చేపట్టారు. జిల్లా ఫారెస్టు రేంజర్ దేవరాజు, డిప్యూటీ రేంజర్ రాఘవేంద్ర, సిబ్బందితోపాటు గ్రామస్తుల సహకారంతో డప్పు చప్పుళ్లు, కర్రలతో ఇంజమ్మ గుట్ట మొత్తం కలియతిరిగారు. పులి కనిపించినట్లు చెబుతున్న ప్రదేశంతోపాటు గుట్ట చుట్టు పక్కల గాలించారు. ఇంజమ్మ గుట్ట సమీపంలో గురువారం రాత్రి రెండు లేగ దూడలను కట్టివేశారని, ఎలాంటి దాడులు జరగలేదని తెలిపారు. అయితే ఎక్కడా పులి అడుగు జాడలు ఎక్కడా కనిపించలేదని రేంజర్ దేవరాజు తెలిపారు. గుట్టల్లోని ముళ్ల పొదలు, చెట్ల మధ్య ముళ్ల పందులు ఆవాసం కోసం తవ్వుకున్న గుంతలను మాత్రం గుర్తించినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. అడవి పిల్లులను చూసి పులి అనుకుని భ్రమ పడి ఉండవచ్చని గ్రామస్తులు కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద ఇందువాసి ఇంజమ్మ గుట్టల్లో పులి సంచారం గట్టు మండలంలో హాట్‌టాపిక్‌గా మారింది. గ్రామస్తులు మాత్రం పులి సంచారం పుకార్లతో ఆందోళన నుంచి తేరుకోలేక పోతున్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు చీకటి పడకముందే ఇళ్లకు చేరుకుంటున్నారు.

హెచ్‌సీఏ లీగ్‌లో పాలమూరు ఓటమి

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లో జరుగుతున్న హెచ్‌సీఏ బీ-డివిజన్ రెండు రోజుల లీగ్‌లో జిల్లా జట్టు ఓటమి చవిచూసింది. టీమ్ స్పీడ్ క్రికెట్ క్లబ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 80 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. అనంతరం రెండో రోజు శుక్రవారం బ్యాటింగ్ చేసిన టీమ్ స్పీడ్ జట్టు 65.3 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 244 పరుగులు చేసింది. విమల్‌దేవ్ 81, అనిరుధ్ కపిల్ 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

తెలంగాణ ఆగ్రోస్‌లో నాణ్యమైన సేవలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): తెలంగాణ ఆగ్రోస్‌ల్లో నాణ్యమైన సేవలు రైతులకు అందుతున్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ధర్మాపూర్ గ్రామ రైతువేదికలో తెలంగాణ ఆగ్రోస్ కార్పొరేషన్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జిల్లా తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల నిర్వాహకులతో 2023-24 వానాకాలం సీజన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ సీజన్‌కు ముందస్తు ప్రణాళికలతో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచుకొని రైతాంగానికి సేవలు అందించాలని ఏఆర్‌ఎస్‌కే నిర్వాహకులకు సూచించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్ తగిన విధంగా ఉపయోగించాలన్నారు. తెలంగాణ ఆగ్రోస్ అధికారి జీపీకే విన్సన్ మాట్లాడుతూ ఆగ్రోస్ కేంద్రాలు మండలానికి రెండు లేదా మూడు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆ కేంద్రాలకు నాణ్యతలో పేరుగాంచిన కంపెనీలతో ఒప్పందం చేసుకొని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, తెలంగాణ సిరి (సిటీ కంపోస్టు), ఆర్గానిక్ ప్రొడక్ట్, టార్పాలిన్లు, స్ప్రేయర్స్, డ్రోన్స్, రొటవేటర్లు ఆగ్రోస్ కేంద్రాలకు సరఫరా చేసి సరసమైన ధరలకు రైతులకు అందిస్తున్నామని చెప్పారు. సేవలను జిల్లాలోని రైతులు వినియోగించుకోవాలని కోరారు. సదస్సులో ఏఓ ఇష్రత్ సుల్తానా, టీఎస్ ఆగ్రోస్ జిల్లా సూపర్‌వైజర్ నివేదిత, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్ సాయి భరత్ తదితరులు పాల్గొన్నారు.

కోటకొండలో వంద నూతన అడ్మిషన్లు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ జెడ్పీ స్కూల్‌లో నూతన విద్యాసంవత్సరంలో వంద కొత్త అడ్మిషన్లు వచ్చినట్లు హెచ్‌ఎం రవికుమార్ తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల్లోని పీఎస్, యూపీఎస్ స్కూళ్లకు చెందిన 6, 8, 9వ తరగతుల విద్యార్థులు పెద్ద ఎత్తున ఆయా పాఠశాలల టీచర్ల ప్రోత్సాహంతో నాలుగు రోజులుగా చేరుతున్నారని చెప్పారు. ముఖ్యంగా తిర్మలాపూర్, అభంగాపూర్, కోటకొండ పీఎస్‌ల నుంచి భారీగా అడ్మిషన్లు వచ్చాయని చెప్పారు. ఆయా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి టెన్త్‌లో ఉత్తమ జీపీఏ సాధించడానికి కృషి చేస్తామన్నారు.



కోటకొండ జెడ్పీ స్కూల్‌లో చేరుతున్న అభంగాపూర్ విద్యార్థులు

క్లుప్తంగా...

19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల సెప్టెంబర్ కోటా విడుదల

తిరుమల: టీటీడీ షెడ్యూల్ ప్రకారం తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల సెప్టెంబర్ నెల కోటాను ఈ నెల 19న విడుదల చేయనుంది. భక్తులు https:// tirupatibalaji. ap. gov. in వెబ్‌సైట్‌లో వీటిని బుక్ చేసుకోవచ్చు. అలాగే సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదుకు అవకాశం ఉంది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన వాళ్లు సొమ్ము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవా టికెట్లను 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవ వర్చువల్ సేవల కోటాను, వాటికి సంబంధించిన దర్శన టికెట్ల కోటాను 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్టు 27 నుంచి 29వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాల సేవా టికెట్ల కోటాను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

హక్కుల ఉద్యమ నేత కుక్కల ఏసు కన్నుమూత



లబ్బీపేట (విజయవాడ తూర్పు): పేదల సమస్యలపై నిరంతరం ఉద్యమించిన హక్కుల ఉద్యమ నేత, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సమితి(ఓపీడీఆర్) ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు, సీపీఐ (ఎంఎల్) నేత కుక్కల ఏసు (75) మరణించారు. విజయవాడ 24వ డివిజన్‌లో న్యూ గిరిపురంలో నివసించే ఏసు వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా గురువారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆయన భార్య 20 ఏళ్ల కిందటే మరణించగా, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏసు ఎయిడెడ్ కళాశాలలో నాల్గవ తరగతి ఉద్యోగిగా పనిచేస్తూనే సీపీఐ (ఎంఎల్), ఓపీడీఆర్‌లో చురుగ్గా వ్యవహరించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 14 పేటలకు సంబంధించి స్మశాన వాటిక ఆక్రమణలకు గురికాగా, దానికోసం వీరోచితంగా ఉద్యమం నడిపారు. ఈ విషయంలో అనేక పర్యాయాలు అరెస్ట్ కూడా అయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్మశాన వాటికను సాధించగలిగారు.



కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన సభకు భారీగా హాజరైన జన సందోహంలో ఓ భాగం

ఇళ్ల యజ్ఞం | ఊళ్లకు ఊళ్లే నిర్మాణం

నాలుగేళ్లుగా పేదల అభ్యున్నతే లక్ష్యంగా అడుగులు ముందుకు

గుడివాడలో టిడ్కో ఇళ్ల అప్పగింత కార్యక్రమంలో సీఎం జగన్

దేవుడి దయతో, మీ అందరి ఆశీర్వాదంతో మనం అధికారంలోకి రాగానే 300 అడుగుల టిడ్కో ఇళ్లను కేవలం ఒక్క రూపాయికే ఇస్తామని గతంలో ఇదే గుడివాడ బహిరంగ సభలో చెప్పాను. ఈ రోజు ఆ మాటను నిజం చేసి చూపిస్తున్నా. ఇవిగో ఆ ఇళ్లు.. ఇవిగో ఆ ఊళ్లు. టిడ్కో ఇళ్ల ద్వారా అక్కచెల్లెమ్మల కుటుంబాలకు మన ప్రభుత్వం రూ.16,601 కోట్లు లబ్ధి చేకూర్చుతూ ఖర్చు భరిస్తోంది. ఇందులో చంద్రబాబు చేసింది ఏమిటి? గుమాస్తాగిరీ కూడా సరిగా చేయలేదు. నిస్సిగ్గుగా తాను చేయని పనులు చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. నోరు విప్పితే అబద్ధాలే.

– సీఎం వైఎస్ జగన్



ఇంటి హక్కు పత్రాలను అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఏపీలో ఇళ్ల నిర్మాణ యజ్ఞం కొనసాగుతోందని, ఏకంగా ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల అభ్యున్నతే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నామని చెప్పారు. కృష్ణా జిల్లా గుడివాడ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం 77 ఎకరాల ఒకే లేఅవుట్‌లో పూర్తయిన 8,912 టిడ్కో ఇళ్లను ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొని, ఇంటి హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకంగా 30.60 లక్షల ఇంటి పట్టాలు అందజేశామని, ఇళ్లు కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పేదలను అప్పులపాలు చేయాలని చూస్తే, మనందరి ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేశామని చెప్పారు. అక్కచెల్లెమ్మలు హక్కుదారులుగా ఆయా కుటుంబాల చరిత్రను మార్చేలా ఇవాళ మనం ఊళ్లకు ఊళ్లు నిర్మిస్తున్నామని చూపించే గొప్ప కార్యక్రమం గుడివాడలో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

కొత్త గుడివాడ కనిపిస్తోంది

- ఒకవైపు టిడ్కో ఇళ్లు.. మరోవైపు మనం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు చూస్తుంటే.. ఇక్కడ కొత్త గుడివాడ నగరం కనిపిస్తోంది. మొత్తం 257 ఎకరాల్లో రూ.800 కోట్లతో 8,912 ఇళ్లు కట్టడమే కాకుండా.. వాటిని నా అక్కచెల్లెమ్మలకు ఇచ్చే కార్యక్రమం ఇవాళ చేస్తున్నాం. ఇదే లే అవుట్‌లో 7,728 ఇళ్ల స్థలాలను ఇళ్లు లేని నా నిరుపేద అక్కచెల్లెమ్మలకు ఇచ్చాం. మొత్తంగా 16,640 కుటుంబాలు ఇక్కడ నివాసం ఉండబోతున్నాయి.
- ఈ లేఅవుట్‌తో పాటు నియోజకవర్గం మొత్తం 13,145 మందికి ఇళ్ల పట్టాలిచ్చాం. వీటికి 8,912 టిడ్కో ఇళ్లు కూడా కలిపితే 22 వేల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలిచ్చామని చెబుతున్నా.
- ఒక్కో ఇంటిని రూ.2.70 లక్షలతో కడుతున్నాం. అక్కడ డ్రెయిన్లు, రోడ్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.6 లక్షలు ఖర్చవుతుంది. ఈ లెక్కన ఇంటి నిర్మాణం పూర్తయితే కనీసం రూ.10–15 లక్షలు వాళ్ల చేతుల్లో పెట్టినట్టవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 30.60 లక్షల ఇళ్లు కూడా చూసుకుంటే మహాయజ్ఞం ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల కోట్ల ఆస్తిని అక్కచెల్లెమ్మల చేతిలో పెడుతున్నాం.
- ఇవాళ ఇచ్చిన పట్టాలకు సంబంధించి 4,200 ఇళ్లు మంజూరైతే మొత్తం 13,145 ఇళ్ల పట్టాలలో కూడా ఇళ్లు వస్తాయి. జూలై 8.. నాన్న గారి జయంతి రోజున ఈ ఇళ్లు కూడా మంజూరు చేస్తాం.

టిడ్కో ఇళ్ల పేరుతో నాడు పేదలపై భారం

- ఈ రాష్ట్రంలో కొంతమందికి ఈర్ష, ద్వేషం ఎక్కువయ్యాయి. ఏ మాత్రం కళ్లార్పకుండా అబద్ధాలు చెబుతున్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గత చంద్రబాబు ప్రభుత్వం చేసిన నిర్వాకమిది. నిరుపేదలు నివాసం ఉండే 300 చదరపు అడుగుల ప్లాట్ కట్టడానికి అయ్యే ఖర్చు అడుగుకు రూ.2 వేలు చొప్పున ఒక్కో ఫ్లాట్‌కు దాదాపు రూ.5.75 లక్షలు, మౌలిక సదుపాయాలకు మరో రూ.లక్ష అవుతుంది. రూ.6.75 లక్షలు ఖర్చయ్యే ఒక్కో ఫ్లాట్‌కు కేంద్రం రూ.1.50 లక్షలు ఇస్తే రాష్ట్రం రూ.1.5 లక్షలు ఇస్తోంది. మిగిలిన రూ.3 లక్షలు చంద్రబాబు హయాంలో పేద వాడి పేరు మీద అప్పుగా రాశారు. ప్రతి నెలా రూ.3 వేలు 20 ఏళ్ల పాటు పేదవాడు కడుతూపోవాలి.
- మీ బిడ్డ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 300 చదరపు అడుగులలో నిర్మిస్తున్న 1,43,600 టిడ్కో ఇళ్లను అన్ని హక్కులతో ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నాం. రూ.6.75 లక్షలయ్యే ఒక్కో ఇంటిని అక్కచెల్లెమ్మల పేరుతో ఇస్తున్నాం.

పేదల వ్యతిరేకి చంద్రబాబు

- నాలుగేళ్లలో మన ప్రభుత్వం ఇన్ని లక్షల ఇళ్లు ఎలా కట్టగలిగింది? 30 లక్షల ఇళ్ల స్థలాలు ఎలా ఇవ్వగలిగింది? ఇదే పని 30 ఏళ్ల క్రితమే సీఎం అయిన చంద్రబాబు, మూడుసార్లు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న ఈ బాబు, 14 ఏళ్లు సీఎంగా ఉండి కూడా ఎందుకు చేయలేకపోయారు? కారణం చంద్రబాబు పేదల వ్యతిరేకి కాబట్టి చేయలేదు.
- 40 ఏళ్ల రాజకీయ జీవితం తర్వాత కూడా ప్రజలకు మంచి చేసిన చరిత్ర లేని చంద్రబాబుకు రెండు పక్కలా రెండు పార్టీలు ఉంటే తప్ప లేచి నిలబడలేని పరిస్థితి. ఇలాంటి ఈ చంద్రబాబు.. 175 నియోజకవర్గాల్లో 175 మంది అభ్యర్థులను కూడా పెట్టలేని ఈ చంద్రబాబు మనకు ప్రత్యర్థి అట! రాజకీయాల్లోకి వచ్చి 15 ఏళ్ల తర్వాత కూడా తాను చంద్రబాబు కోసమే పుట్టానంటున్నట్లు ప్రవర్తిస్తున్న ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు మరో వంక. తన జీవితమే బాబు కోసమని, తన వ్యాన్‌ను చూసి మురిసిపోతూ, ఇక తాను కూడా ఎమ్మెల్యే అవుతానని, తనను ఎవరు ఆపుతారో చూస్తానంటున్నారు. వీరికితోడు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5.. మొత్తంగా గజ దొంగల ముఠా మళ్లీ రాష్ట్రాన్ని దోచుకోవాలని ప్రజల ముందుకు వస్తోంది. మీరంతా ఈ దుష్టచతుష్టయం అబద్ధాలను నమ్మకండి. మీ ఇంట్లో మీకు మంచి జరిగిందా? లేదా? అన్నది మాత్రమే కొలమానంగా తీసుకోండి. మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు సైనికులుగా మారండి.

సీఎం కావడానికి నేను సిద్ధమే

- 14 ఏళ్ల వనవాసం పూర్తయ్యింది
- సంపూర్ణ అధికారం ఇచ్చి సీఎం స్థానం ఇవ్వండి
- వారాహి యాత్రలో జనసేన అధ్యక్షుడు పవన్



పిఠాపురంలో పవన్ ప్రసంగిస్తుండగానే వెళ్లిపోతున్న అభిమానులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సీఎం కావడానికి తాను సిద్ధంగా ఉన్నానని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పారు. తన 14 సంవత్సరాల వనవాసం పూర్తయిందని, ఈ సారి అంతా జనసేన వైపు చూడండని అన్నారు. వారాహి యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో జరిగిన వారాహి సభలో పవన్ మాట్లాడారు. తనకు సంపూర్ణ అధికారం ఇచ్చి సీఎం స్థానం ఇస్తే దేశంలో ఉన్నతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఏ పదవీ లేకున్నా ప్రజల కోసం పోరాడుతూనే ఉన్నానని చెప్పుకొచ్చారు. నాడు తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఉంటే ఈ రోజు ఇలా ఉండేది కాదన్నారు. శక్తిపీఠం సాక్షిగా చెబుతున్నానని, ఆంధ్రా వీడి వెళ్లనని, సురక్ష ఆంధ్రాగా తీర్చిదిద్దుతానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ దుష్ట ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. జనసేన అధికారంలోకి వస్తే మొదటగా రాష్ట్రంలో శాంతిభద్రతలను గాడిలో పెడుతుందన్నారు. రాష్ట్రంలో 219 హిందూ ఆలయాను కూల్చివేస్తే ఈ ముఖ్యమంత్రి, ఈ ప్రభుత్వం ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేకపోయిందన్నారు. హిందువులు ప్రపంచంలో మైనార్టీలన్నారు. తవ్వేకొద్దీ వైఎస్సార్‌సీపీ అవినీతి బయటపడుతుందని అన్నారు. తిరుపతి శ్రీవాణి ట్రస్ట్ నిధులను అడ్డగోలుగా దోచేస్తున్నారని విమర్శించారు. మన కులపోడు అని చూడకూడదని, ఆంధ్రా బాగుపడాలంటే సరైనోడు కావాలి అనుకోండి అని అన్నారు.

ఎన్నికల్లో పోటీపై స్పష్టత ఉందా పవన్?

- సీఎం అవ్వాలనుకుంటున్నావా? లేదా?
- సగం స్థానాల్లోనైనా అభ్యర్థులను నిలబెడతావా? సింగిల్ పోటీ చేస్తావా?
- మంత్రి అంబటి రాంబాబు సూటి ప్రశ్నలు



సాక్షి, రాజమహేంద్రవరం: ఎన్నికల్లో పోటీపై జనసేన నేత పవన్ కల్యాణ్‌కు స్పష్టత ఉందా అని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. '175 స్థానాల్లో జనసేన పోటీ చేస్తుందా? సగం స్థానాల్లోనైనా బరిలోకి దిగుతారా? సింగిల్‌గా పోటీ చేస్తావా' అన్న క్లారిటీ పవన్ ఇవ్వాలని అన్నారు. మంత్రి రాంబాబు శుక్రవారం రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చి హీరో అనిపించుకున్న వ్యక్తి ఎన్టీఆర్ అయితే.. పవన్ కామెడీ యాక్టర్ అయ్యాడని విమర్శించారు. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టిన పవన్ ఐదేళ్ల టీడీపీ పాలనలో ఎవరిని ప్రశ్నించారని దుయ్యబట్టారు. మంచి పనులు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను, వైఎస్సార్‌సీపీని ప్రశ్నించేందుకే పార్టీ నడుపుతున్నారని అన్నారు. పవన్ గతంలో పొత్తులన్నారని, ఇప్పుడేమో లేదంటున్నారని, పర్యటనకో మాట మారుస్తున్నారని చెప్పారు. సీఎం అభ్యర్థి ఆయన కాదని చెప్పిన పవన్.. 2024, 2029 ఎన్నికల్లో గెలిపించాలని చెప్పడం ఆయన చంచల మనస్తత్వానికి నిదర్శనమన్నారు. కేవలం అసెంబ్లీలో అడుగు పెట్టేందుకే రాజకీయం చేస్తున్నారా? ఆయనకు సీఎం అవ్వాలని ఉందా? లేదా? చంద్రబాబును సీఎం చేసేందుకు యాత్రలు చేస్తున్నారా సూటిగా చెప్పాలని అన్నారు. ఎక్కడ నిలబడతాడో కూడా తెలియని వ్యక్తితో జన సైనికులు, వీర మహిళలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఏ విషయంలోనూ స్పష్టత లేని పవన్‌తో సావాసం కుక్కతోకను పట్టుకుని గోదావరి ఈదినట్లేనన్నారు. పవన్ రాజకీయాలకు పనికిరాడని స్పష్టంగా చెప్పారు. చిరంజీవి పార్టీ పెట్టి 18 సీట్లు గెలిచారని, రాజకీయాల్లో నిలబడలేనని నిశ్చయించి గొప్ప నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రాష్ట్రాన్ని పాలించాలనుకున్న పార్టీ అధినేత ఎక్కడైనా చెప్పులు చూపిస్తారా అని ప్రశ్నించారు. పవన్, చంద్రబాబు, బీజేపీ కలిసి పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో విజయం వైఎస్ జగన్‌దేనని చెప్పారు. పవన్, చంద్రబాబుని ఉడత ఊపులేనన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో 98 శాతం అమలు చేసిన జగన్ పక్షానే పేదలు ఉన్నారని తెలిపారు.

రాష్ట్రపతి కంబైండ్ పరేడ్‌కు నిఖిల్ సాయి

తెలంగాణ నుంచి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ఎంపిక



ఇండియన్ ఏయిర్ ఫోర్స్ ఫ్లయింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకోనున్న నిఖిల్ సాయి

వనపర్తిటౌన్: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఫ్లయింగ్ ఆఫీసర్‌గా నేడు తెలంగాణ నుంచి వనపర్తి పట్టణానికి చెందిన కౌన్సిలర్ చంద్రకళ, ఎల్‌ఐసీ కృష్ణ దంపతుల కుమారుడు నిఖిల్ సాయి నియామక బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ మేరకు ఇండియన్ కంబైండ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు వస్తున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా బాధ్యతల స్వీకరణ పత్రాన్ని అందుకోనున్నాడు. 2019లో డిఫెన్స్ అకాడమీలో మూడేళ్ల పాటు శిక్షణ పొంది, ఫ్లయింగ్ ఆఫీసర్‌గా శిక్షణను పూర్తి చేసుకున్నాడు. తెలంగాణ నుంచి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ప్రస్తుతానికి నిఖిల్ సాయి ఒక్కడే నిలవనుండటంతో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అభినందనలు తెలిపారు.

త్వరలోనే ఏదుల పంప్‌హౌస్ డ్రై రన్



గోపాల్‌పేట: త్వరలోనే ఏదుల పంప్‌హౌస్‌లో పంప్‌ల డ్రై రన్ నిర్వహిస్తామని నీటి పారుదల శాఖ సీఈ హమీద్‌ఖాన్ వెల్లడించారు. శుక్రవారం పంపింగ్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన 400 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. డిండి నుంచి ఏదుల పంపింగ్ స్టేషన్ వరకు ఏర్పాటు చేసిన 400 కేవీ 60 కిలో మీటర్ల ట్రాన్స్‌మిషన్ లైన్ సైతం చార్జ్ చేశామన్నారు. విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ చార్జ్ చేయడంతో పంపింగ్ స్టేషన్ నడవడానికి మార్గం సుగమం అయిందన్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ఇంజినీరింగ్ అధికారులకు ఫోన్ చేసి అభినందించారు. కార్యక్రమంలో సీఈ శ్రీరాంనాయక్, సీఈ లతావినోద్, ఎస్‌ఈలు విజయ్ భాస్కర్‌రెడ్డి, మాణిక్యరావు, ఈఈలు రాము, రవీందర్, మహేందర్‌రెడ్డి, హరిప్రసాద్, డీఈలు సత్యనారాయణగౌడ్, దశరథం, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతాదయాకర్‌రెడ్డికి రేవంత్‌రెడ్డి పరామర్శ



సీతాదయాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

చిన్నచింతకుంట: మండలంలోని పర్కాపురంలో మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా.. విషయం తెలుసుకున్న రేవంత్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి సీతాదయాకర్‌రెడ్డిని పరామర్శించి.. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, మాజీ మంత్రి చిన్నారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, మాజీ ఎమ్మెల్యేలు, సంపత్‌కుమార్, ఎర్రశేఖర్, నారాయణపేట, మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి, నాయకులు ప్రదీప్‌కుమార్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, వేణుగోపాల్ న్నారు.

తరలివచ్చిన కార్యకర్తలు

కొత్తకోట దయాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి పర్కాపురానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వస్తున్నారనే సమాచారంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పర్కాపురానికి భారీగా తరలివచ్చారు. దీంతో పర్కాపురం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కిటకిటలాడింది. కేవలం పరామర్శ కోసమే వచ్చిన రేవంత్‌రెడ్డి అక్కడే ఉన్న కార్యకర్తలను పలకరించడంతో కాబోయే సీఎం రేవంత్ అన్న అంటూ నినాదాలు చేశారు. అంతకు ముందు పర్కాపురానికి వస్తున్న రేవంత్‌రెడ్డిని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్ గౌడ్, లాల్‌కోట క్రాసింగ్ వద్ద స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

ఘన స్వాగతం పలికిన నాయకులు

బాలానగర్: దయాకర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తిరుగు ప్రయాణంలో మండలంలోని పెద్దాయపల్లి గ్రామ ముఖ్య కూడలి వద్ద పార్టీ శ్రేణులకు అభివాదం చేసిన ఆయన్ను పలువురు పార్టీ నాయకులు కలిసి వారి అభిమానాన్ని చాటుకున్నారు. పూలదండలతో, శాలువాలతో స్వాగతం పలికారు. పార్టీ కోసం కష్టపడాలని పిలుపునిచ్చి రేవంత్ రెడ్డి అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఆయన వెంట టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌లతో పాటు మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, శంకర్ నాయక్, గణేష్ గౌడ్, భాస్కర్ నాయక్ తదితరులు ఉన్నారు.

32 ఎకరాలు మావే!

కోర్టు తీర్పు వచ్చే వరకు పనులు చేపట్టొద్దంటున్న రైతులు



భూములు తమవేనని పహాణీలు, కోర్టు పత్రాలు చూపిస్తున్న రైతులు

దేవరకద్ర రూరల్: మండలంలోని బొల్లారంలో 32 ఎకరాలకు సంబంధించిన భూమి పంచాయితీ అటు అధికారులకు, ఇటు రైతులకు తలనొప్పిగా మారింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంపదవనాల పేరుతో ఇరిగేషన్ స్థలాల్లో హరితోత్సవం పేరిట అధికారులు భారీగా మొక్కలు నాటేందుకు నిర్ణయించారు. అందుకు జిల్లాలో 4 మండలాలను ఎంపిక చేయగా.. అందులో దేవరకద్ర మండలంలోని బొల్లారం (కోయిల్‌సాగర్)ను ఎంపిక చేసి 11 ఎకరాల్లో 10,200 మొక్కలు నాటాలని నిర్ణయించారు. అందులో భాగంగానే ఈ నెల 14న భూమిని చదును చేసేందుకు అధికారులు వెళ్లారు. అయితే ఈ భూములు మావి అని అక్కడ ఉన్న రైతులు అధికారులను అడ్డుకున్నారు. దీంతో ఇరిగేషన్ అధికారులు పనులను అడ్డుకున్న వారిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలు, కోర్టులో వేసిన కేసు గురించి పోలీసులకు వివరించారు. ఇదిలా ఉండగా అధికారుల సూచన మేరకు శుక్రవారం ఇరిగేషన్ సిబ్బంది మొక్కలు నాటేందుకు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. విషయం పూర్తిస్థాయిలో తెలిసేవరకు ఎలాంటి పనులు చేపట్టనివ్వమని స్పష్టం చేశారు.

నిబంధనల మేరకు వ్యవహరిస్తున్నాం..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారుల సహకారంతో బొల్లారంలో 11 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాం. అందులో మొక్కలు నాటి హరితోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. ఇందులో పూర్తిగా ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకుంటున్నాం.

– ప్రతాప్‌సింగ్, ఇరిగేషన్ ఈ ఈ

స్పందన లేకపోవడంతో..

బొల్లారం శివారులోని సర్వే నం. 147లో 14 ఎకరాల 26 గుంటలు, 150లో 11 ఎకరాల 17 గుంటలు, 139లో అయిదు ఎకరాల 24 గుంటలు కలిపి మొత్తం 32 ఎకరాల భూమి 1960 వరకు మా కుటుంబ సభ్యుల పేరుపై ఉంది. వారు చనిపోయాక అది ప్రభుత్వ భూమిగా మార్చారు. ధరణి పోర్టల్ వచ్చాక మాకు విషయం తెలిసింది. దీంతో పట్టా భూమి ప్రభుత్వ భూమిగా ఎలా మారిందని విషయం స్థానిక అధికారులను అడిగినా.. సరైన స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయించాం. దీనిపై అధికారులను కలిసి వినతి పత్రం అందించాం. తుది తీర్పు వచ్చే వరకు మా భూముల్లో ఎలాంటి చేపట్టనివ్వమని రైతులు తెలియజేశారు.

జోగుళాంబ ఆలయంలో చండీహోమాలు



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాల్రబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారోత్సవంలో భాగంగా సామూహిక చండీహోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సుమారు 54 మంది సామూహిక చండీహోమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేముల విక్రాంత్ శర్మ ఈ చండీహోమాలను నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన హోమాలు మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్ణాహుతి సమర్పించి ముగించారు. ఇదిలా ఉండగా.. శుక్రవారం కావడంతో భక్తులు ఆలయానికి విశేషంగా తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్.ఆర్.ఐ పాండురంగాచార్య సుమలత దంపతులు ప్రత్యేకంగా అమ్మవారికి జంబీరఫలార్చన, స్వామి వారికి ఏకవార రుద్రాభిషేకాలు చేయించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు శేషవస్త్రాలను అందజేశారు. అదే విధంగా ప్రదోశకాలంలో అమ్మవారి ప్రాంగణంలో రథోత్సవం నిర్వహించి ఆలయం చుట్టూ ప్రాకార ప్రదక్షిణలు చేశారు. గర్భాలయంలో కొలువు దీరిన జోగుళాంబ అమ్మవారికి దశవిదహారుతులు సమర్పించి భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో భోజన సదుపాయం కల్పించారు.

రాష్ట్రంలో రజాకార్ల పాలన



మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్

బాలానగర్: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రజాకార్ల పాలన సాగిస్తున్నారని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ అన్నారు. శుక్రవారం జడ్చర్ల మండలంలో అక్రమంగా అరెస్టు చేసి బాలానగర్, రాజాపూర్, మిడ్జిల్ పోలీస్‌స్టేషన్లకు తరలించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ విషయమై ఆయన బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. జడ్చర్లలో ఓ యువతి పరీక్ష రాయడానికి ముందు హాల్‌టికెట్ మరచిపోతే ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని హాల్‌టికెట్ తెచ్చిన ఓ బీజేవైఎం యువకుడిని మైనారిటీ పీఎఫ్‌ఐ ముఠా నాయకులు విచక్షణ రహితంగా దాడిచేశారని, ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే మూడు రోజులైన నిందితులను అరెస్టు చేయలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో హిందువులకు రక్షణ లేకుండాపోయిందని ధ్వజమెత్తారు. ముస్లింల ఓట్ల కోసమే బీఆర్‌ఎస్ పాలకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. 24 గంటల్లో నిందితులను అరెస్టు చేయకపోతే రాష్ట్ర బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రజాకార్ల పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని, వచ్చేది హిందూ రాజ్యమే అని చెప్పారు. సమావేశంలో యువమోర్చ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదీష్, ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు బిజ్జుల అవినాష్, శివాజీ, వేణు, కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యాసంస్థల మెనూ టెండర్ ఖరారు

నాగర్‌కర్నూల్: మన్ననూర్ ఐటీడీఏ పరిధిలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో కొనసాగుతున్న 18 ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఏకలవ్య, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో మెనూకు అవసరమైన ఆహార పదార్థాల సరఫరాకు టెండర్లు ఖరారు చేశామని నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, గిరిజన సంక్షేమ శాఖ ఆర్‌సీఓ, ఏపీటీడబ్ల్యూఓలు, గురుకులాల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, టెండర్లు దాఖలు చేసిన కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన్ననూర్ ఐటీడీఏ పరిధిలోని గురుకుల బాలికల, బాలుర కళాశాలలతోపాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వెల్దండ మండలంలో నిర్వహిస్తున్న ఏకలవ్య రెసిడెన్షియల్ మోడల్ స్కూల్‌లో మెనూ అమలుకు సంబంధించి 18 గురుకుల పాఠశాలల వారీగా టెండర్లు ఆహ్వానించామన్నారు. టెండర్లు ఖరారైన సంబంధిత కాంట్రాక్టర్లు నిబంధన మేరకు నాణ్యమైన సరకులు సరఫరా చేయాలని, ముఖ్యంగా గుడ్లకు సంబంధించిన కాంట్రాక్టర్‌కు ప్రత్యేక సూచనలు చేశారు. అలాగే స్కిన్‌లెస్ చికెన్ సరఫరా చేయాలని, అరటి పండు పరిమాణం పెద్దదిగా ఉండాలన్నారు. ప్రతి నెలా అన్ని పాఠశాలలు, గురుకులాల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, వార్డెన్లలతోపాటు కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. మెనూ అమలుకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని ఆదేశించారు.